అంబేడ్కర్ మార్గం యువతకు ఆదర్శం




కీసరలో.. నివాళులర్పిస్తున్న సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అధ్యక్షుడు గాలిగల్ల సాయిబాబా, ఘట్‌కేసర్‌లో....

ఘట్‌కేసర్: మహనీయుల జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాలని కాంగ్రెస్ మున్సిపల్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫరూక్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ మార్గంలో నేటి యువత పయనించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాందాసు, నర్సింగ్‌రావు, సత్యం, గణేష్‌గౌడ్, నిఖిల్, విష్ణు, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

కీసర: భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్ ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అధ్యక్షుడు గాలిగల్ల సాయిబాబా అన్నారు. ఆదివారం కీసరలోని అంబేడ్కర్ విగ్రహానికి నిర్వహించిన జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలు అందరికీ మార్గదర్శకాలన్నారు. జ్ఞానమాల కార్యక్రమ అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, జీఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అంబేడ్కర్ అభిమాన సంఘాల ప్రతినిధులు కుమార్, మల్లేష్, వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్మాదులు ఎక్కడున్నా వదిలిపెట్టం: ఎంపీ ఈటల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మేడ్చల్‌రూరల్: ప్రధాని మోదీ టెర్రరిజం, ఉన్మాదుల మీద ఉక్కుపాదం పెట్టారని ఈ ఉన్మాదులు ఎక్కడ ఉన్నా వదిలిపెట్టమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ కేనోపిలో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్, మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ 2 నెలల వ్యవధిలో ఆరు ఆలయాలు ధ్వంసం అయినా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకోవాల్సి వస్తుందన్నారు. హైదరాబాద్ నగరం ఇప్పుడిప్పుడే బాంబు పేలుళ్ల నుంచి తేరుకుంటుందన్నారు. చెరువుల చుట్టు ఇళ్లు కట్టుకున్న వాళ్లలో 99 శాతం మందివి అక్రమాలు కావని, పట్టాభూముల్లో ప్రభుత్వ అనుమతులతో కట్టుకున్నవని తెలిపారు. హైడ్రా పేరుతో దొంగల్లాగ ఆశల సౌధాలను కూలగొట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో విస్తరింపజేయాలని ఇప్పటికే పార్లమెంట్‌లో మాట్లాడినట్లు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, సరస్వతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 19వ డివిజన్‌లో రూ.90లక్షలతో అభివృద్ధి పనులు, 15వ డివిజన్ అమ్మసాని వెంకట్‌రెడ్డినగర్‌లో రూ. 8 లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సామల పవన్ రెడ్డి, కొత్త దుర్గమ్మగౌడ్, డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మెగా జాబ్ మేళా విజయవంతం



నియామక పత్రం అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలోని హోలీ ఫెయిత్ గ్రామర్ స్కూల్‌లో రుచిత అసోసియేట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. మేళాలో 62 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలో పాల్గొనగా 45 అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య హాజరై ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. జాబ్ పొందిన వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించడం అభినందనీయమని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 15 వేలకు పైగా వేతనం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మారావు, నాయకులు జంగయ్యయాదవ్, సిరాజ్, హోలీ ఫెయిత్ స్కూల్ కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, రుచిత అసోసియేట్స్ అధికారులు పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఎం ఎప్పుడూ నిలబడుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

మేడ్చల్: దేశంలో ఏ ప్రాంతంలోనైనా పేద ప్రజలు ఇబ్బందులు ఉంటే వారి పక్షాన సీపీఎం పోరాటం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్ర అశోక్ అన్నారు. మేడ్చల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా 2వ మహాసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. పేదలకోసం సీపీఎం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. హైడ్రా వల్ల పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ప్రభుత్వం కూల్చివేతల పేరుతో టైంపాస్ చేస్తోందన్నారు. చెరువులను గెస్ట్ హౌస్‌లుగా మార్చుకున్న బడా వేత్తల నిర్మాణాలు కూల్చివేయకుండా పేదల ఇళ్ళను కూలుస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ప్రతీ మండలంలో, మున్సిపాలిటీ పార్టీ నూతన కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తీర్చడానికి అవసరమైన పోరాటాలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



మన ఆలయాలను మనమే కాపాడుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కీసర: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో జరిగిన ఘటనపై విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కీసరలోని అంబేడ్కర్ విగ్రహ కూడలి వద్ద ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 'సేవ్ హిందూ' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిరసనలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ నాయకుడు చినింగనీ ఆనందరావు మాట్లాడుతూ.. ముత్యాలమ్మ గుడిలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. పథకం ప్రకారం ఎంఐఎం పార్టీ కనుసన్నల్లోనే దాడి జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా హిందువులు ఏకతాటిపైకి వచ్చి మన ఆలయాలను మనమే కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నిరసన చేపట్టిన ప్రదేశానికి కీసర ఎస్ఐ వెంకటేష్‌తో పాటు పోలీసులు రావడంతో ఘర్షణ నెలకొంది. దీంతో నిరసనకారులను పోలీసులు వెళ్లగొట్టారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, అరవింద్, మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో వారికి కండువ కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బాలరాజ్, మాజీ వార్డు సభ్యుడు శ్యామ్‌రావు, నాయకులు మధు, సురేష్‌గౌడ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా మాధవరెడ్డి, జంగయ్యముదిరాజ్, సందీప్‌రెడ్డి, సాయిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కట్టమైసమ్మను దర్శించుకున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్



శామీర్‌పేట్: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆదివారం శామీర్‌పేటలోని కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అశోక్, కాంగ్రెస్ పార్టీ శామీర్‌పేట మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కిషోర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ సాయిబాబా, నాయకులు ఆంజనేయులు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మండలంలోని రావల్‌కోల్ సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ మౌలాలి తెలిపారు. రావల్‌కోల్ గ్రామంతో పాటు గ్రామ పరిధిలో అన్ని పరిశ్రమలకు, ఐడీఏ రావల్‌కోల్ పరిశ్రమలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

బీఆర్ఎస్ ధర్నా

మేడ్చల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ సీజన్ రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. నాయకులు రోడ్డు పై బైటాయించి ప్రభుత్వంకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. రైతులకు వెంటనే రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, దయానంద్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, నాయకులు సందీప్‌గౌడ్, ఈశ్వరయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రైనీ పోలీసుల రక్తదానం



మేడ్చల్‌రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిక్షణ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో 250 మంది ట్రైనీ పోలీసులు రక్తదానం చేశారు. అమర పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విలీన గ్రామాల్లో చైర్మన్ పర్యటన



విలీన గ్రామాల్లో పర్యటిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో చైర్మన్ కొండల్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కాలనీల్లో ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కారం కోసం తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం చౌదరిగూడలోని వెంకటాద్రి టౌన్‌షిప్ ఫేజ్ 2,3, యాదాద్రి కాలనీ, వెంకటాపూర్, వైభవ్ కాలనీ, కొర్రెముల ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, నాయకులు బాల్‌రెడ్డి, కాలనీవాసులు సతీష్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఎం మండల కార్యదర్శిగా నరేష్



మేడ్చల్: సీపీఎం మండల పార్టీ కార్యదర్శిగా మందపురం నరేష్ ఎన్నికయ్యారు. మేడ్చల్‌లో నిర్వహించిన మహాసభల్లో నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రమేష్, నర్సింగ్‌రావు, ప్రశాంత్, కొమురయ్య, వసంత, జ్యోతిను ఎన్నుకున్నారు.

యువకుడి ఆత్మహత్య



వినయ్‌రాజు(ఫైల్)

శామీర్‌పేట్: ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం, మజీద్‌పూర్ గ్రామానికి చెందిన వినయ్‌రాజు (23), ఆదివారం మధ్యాహ్నం బైక్ పై ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడి తండ్రి తన వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్ళగా వినయ్‌రాజు బైక్ కనిపించింది. దీంతో చుట్టుపక్కల వెతకగా హనుమల్ల కుంట పక్కన గల ఓ చెట్టుకు కరెంట్ కేబుల్ వైర్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించాడు. ఈ నేపథ్యంలో పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

